# ఔటర్ చుట్టూ.. క్రికెట్ గ్రౌండ్లు..

**శివారు ప్రాంతాల్లో సరికొత్త కల్చర్**

**జీవో 111 పరిధిలో ఖాళీ భూముల ఆదాయానికి మార్గాలు**

**అటు భూముల రక్షణ... ఇటు ఆటవిడుపు కేంద్రాలు**



నగర శివారు ప్రాంతంలోని ఓ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ఆటల్లో యువ తరానికి క్రికెట్ మించిన క్రేజీ మరో క్రీడకు ఉండదు. గల్లీ నుంచి మైదానం దాకా ఎక్కడ చూసినా చేతిలో బ్యాట్ పట్టుకొని షాట్ కొట్టేందుకు తహ తహలాడుతూ ఉంటారు. అలాంటి క్రేజీ ఉన్న ఆటకు కావాల్సిన మైదానాలు ప్రభుత్వ పరంగా ప్రధానంగా మూడే ఉన్నాయి. వాటిలో మొదటిది ఎల్బీ స్టేడియం, రెండోది జింఖానా గ్రౌండ్ కాగా, మూడోది ఉప్పల్ స్టేడియం ఉంది. కానీ ఈ క్రికెట్ గ్రౌండ్లలో ఎవరు పడితే వారు ఆడలేరు. కనీసం బ్యాట్ పట్టుకొని ప్రాక్టీస్ చేసేందుకు అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఉన్న క్రికెట్ ఆటకు ఉన్న క్రేజీని కొందరు తమ వ్యాపారంగా మార్చుకుంటున్నారు. ముఖ్యంగా విశాలమైన క్రికెట్ మైదానం కావాలంటే ఎకరాల్లో భూమి అందుబాటులో ఉండాల్సిందే. అలాంటి పరిస్థితి ఔటర్ రింగు రోడ్డు లోపల కంటే ... బయట మాత్రం పుష్కలంగా ఉంది. అందుకే వందల సంఖ్యలో క్రికెట్ మైదానాలు ఔటర్ బయటనే ఉండగా, అందులో మెజార్టీ మైదానాలు ఐటీ కారిడార్‌కు సమీపంలోనే ఉన్న గండిపేట, హిమాయత్‌సాగర్, అజీజ్‌నగర్, మొయినాబాద్, శంషాబాద్ ప్రాంతాల్లోనే ఉన్నాయి.

### 111 జీవో పరిధిలోనే అత్యధికం...

నగరాన్ని ఆనుకొని ఉన్న జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్‌సాగర్ చుట్టూ పక్కల ప్రాంతమంతా జీవో 111 పరిధిలో ఉండడంతో వందకు పైగా క్రికెట్ గ్రౌండ్‌లు ఇప్పుడు క్రికెట్ ప్రియులకు అందుబాటులో ఉన్నాయి. ఐటీ కారిడార్‌కు, సంపన్నులు, సెలబ్రెటీలు ఎక్కువగా నివాసముండే ప్రాంతాలకు సైతం 111 జీవో పరిధి సమీపంలో ఉండడంతో ఈ ప్రాంతం ప్రైవేట్ క్రికెట్ మైదానాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. నిబంధనల ప్రకారం ఇక్కడి భూముల్లో అధికారికంగా లే అవుట్‌లు చేయడానికి, ఇండ్ల నిర్మాణానికి అనుమతి లేకపోవడంతో భూ యజమానులంతా ఆదాయం కోసం తమ భూముల్లో క్రికెట్ గ్రౌండ్‌లను నిర్మించి అద్దెకిస్తున్నారు. ఇలా ఒక్కో క్రికెట్ గ్రౌండ్‌ను 1-2 ఎకరాల్లో విస్తీర్ణంలో నిర్మిస్తూ క్రికెట్ టీమ్‌లకు లీజుకు లేదా మ్యాచ్‌ల వారీగా, రోజుల వారీగా అద్దెకు ఇస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు.

### నగరంలో వందల సంఖ్యలో క్రికెట్ టీమ్‌లు...

విద్యార్థి దశ నుంచే క్రికెట్‌లో ఆసక్తి ఉన్న వారు తమ స్నేహితులతో క్రికెట్ టీమ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా తాము పనిచేసే కార్యాలయంలో, నివాసముండే కాలనీవాసులు, స్కూల్, కాలేజ్ మేట్స్ ఇలా... ఎంతో మంది క్రికెట్ టీమ్‌లను ఏర్పాటు చేసుకుంటూ ఎప్పుడు సమయం దొరికినా.. ఇతర క్రికెట్ టీమ్‌లతో కలిసి శివారు ప్రాంతాల్లో ఉన్న మైదానాల్లో క్రికెట్ ఆడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. కొన్ని టీమ్‌లు పోటీలు పెట్టుకొని ప్రైజ్‌మనీని నిర్ణయించుకొని క్రికెట్‌ను ఆడుతున్నారు. ఐటీ ఉద్యోగుల్లో కొందరు వీకెండ్ వచ్చిందంటే చాలు.. తమ జట్లతో క్రికెట్ గ్రౌండ్లలో బ్యాట్, వికెట్లు, బాల్స్‌తో దిగిపోతున్నారు. డ్రెస్‌కోడ్‌తో పాటు పూర్తి స్థాయిలో కోచ్‌లు పర్యవేక్షణలో మ్యాచ్‌లను ఆడుతున్నారు. కొందరు ఆరోగ్యంగా ఫిట్‌నెస్‌తో ఉండేందుకు క్రికెట్ ఆట పట్ల ఎక్కువగా ఆసక్తి చూపుతూ తరచూ ప్రైవేట్ క్రికెట్ మైదానాల్లో స్నేహితులతో కలిసి ఆడేందుకు వెళ్తున్నారు. ఇలా నగరవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు టీవీల్లో వచ్చే కికెట్ చూసి ఎంజాయ్ చేస్తూనే వారంలో ఒక రోజు, లేదంటే సెలవు రోజుల్లో క్రికెట్ ఆడేందుకు అమితాసక్తిని చూపుతున్నారు.

### 70 శాతం క్రికెట్ మైదానాలు...

క్రికెట్ మైదానాలకు ఉన్న డిమాండును దృష్టిలో పెట్టుకొని భూయజమానులు మైదానాలుగా తీర్చిదిద్ది రోజు, నెలవారీ అద్దెలను పొందుతున్నారు. ఒక మైదానంలో ఒక మ్యాచ్‌కు రూ.6-7వేల వరకు వసూలు చేస్తుండగా, ఫ్లడ్ లైట్స్ ఉన్న మైదానాలకు రూ.10-13వేల దాకా వసూలు చేస్తున్నారు. దీంతో ఒక్కో క్రికెట్ గ్రౌండ్‌కు నెలకు రూ.1.50 లక్షల నుంచి 2 లక్షల దాకా వస్తోంది. ఇందులో నిర్వహణ ఖర్చులు పోనూ సగం దాకా మిగులుతోందని క్రికెట్ మ్యాచ్‌ల నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రైవేట్ క్రికెట్ మైదానాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సైతం లీగ్ మ్యాచ్‌లను నిర్వహిస్తుండడంతో మైదానాలకు ఏడాది పొడవునా డిమాండు ఉంటోంది. బహుళ జాతీయ కంపెనీలు (ఎంఎన్‌సీ) తమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు తరచూ మైదానాలను వారం రోజుల పాటు అద్దెకు తీసుకుంటున్నాయి. ఇలా రకరకాల రూపాల్లో డిమాండు ఉండడంతో కొందరు 2-3 ఎకరాల ఖాళీ స్థలాన్ని 5-10 ఏండ్లకు లీజుకు తీసుకొని క్రికెట్ మైదానాలను నిర్మిస్తున్నారు. ఇలాంటి ఎక్కువగా జీవో 111 పరిధిలోనే ఎక్కువగా ఉన్నాయని క్రికెటర్లు పేర్కొంటున్నారు. ఐటీ కారిడార్‌కు, ఓఆర్‌ఆర్‌కు సమీపంలో ఉండడంతో ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సిన అవసరం లేకుండానే క్రికెట్ మైదానాలకు చేరుకునే అవకాశం ఈ ప్రాంతానికి ఉంది. అందుకే తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి చేవెళ్ల వెళ్లే మార్గానికి అటు ఇటూ ఉన్న ప్రాంతంలోనే 50-70 క్రికెట్ గ్రౌండ్‌లు ఉండగా, మొత్తం నగరంలో ఔటర్ రింగు రోడ్డు చుట్టూ 150 దాకా ఉంటాయని క్రికెట్ ప్లేయర్ శ్రీధర్ తెలిపారు.



ఒప్పంద పత్రంపై సంతకం చేస్తున్న ఎన్ఐఎన్ డైరెక్టర్ హేమలత, ఆయుష్ డీజీ డా. జహీర్ అహ్మద్

## న్యూట్రాస్యూటికల్ అధ్యయనంలో ఎన్ఐఎన్

సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ) : న్యూట్రాస్యూటికల్ అధ్యయనంలో జాతీయ పోషకాహార సంస్థ కీలక బాధ్యతలు నిర్వహించనున్నది. యునానీ మెడిసిన్ కోసం అవసరమైన మూలికలు, మందుల తయారీలో ఎన్ఐఎన్ కూడా పరిశోధనలు చేయనున్నది. ప్రకృతి సిద్ధంగా దొరికే మూలికలతో యునానీ మందులను తయారు చేస్తుండగా, వీటిని దీర్ఘకాలిక వ్యాధుల్లోనూ ఎక్కువగా వాడుతున్నారు. ఇటీవల కాలంలో ఆయుర్వేద, యునానీ మందుల వినియోగం పెరుగుతున్న క్రమంలో జాతీయ పోషకాహార సంస్థతో కుదిరిన ఒప్పందం కీలకంగా మారింది. ఈ క్రమంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునానీ మెడిసిన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం రోగాల నియంత్రణ, థెరపీలో వినియోగించే ఔషధాలపై ఎన్ఐఎన్ పరిశోధకులు కూడా అధ్యయనం చేయనున్నారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఇకపై న్యూట్రాస్యూటికల్స్ పరిశోధనల్లో డైరెక్టర్ జనరల్ డా. జహీర్ అహ్మద్, ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. హేమలత ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ప్రస్తుతం వంటింట్లో దొరికే మసాలా దినుసుల్లో ఉండే పోషక, ఔషధ గుణాలపై ఎన్ఐఎన్ కొంతకాలంగా లోతైన పరిశోధనలు చేస్తున్నది. ఇటీవలే దాల్చిన చెక్కలో దాగి ఉన్న క్యాన్సర్ నియంత్రణ ఔషధ గుణాలను వెలుగులోకి తీసుకొచ్చింది.

## ఆకట్టుకున్న నృత్యం..

రవీంద్రభారతి, డిసెంబర్ 17: రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఆదివారం దీపాంజలి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకున్నది. ప్రముఖ నర్తకీమణి దీపికారెడ్డి కుమార్తె శ్లోకారెడ్డి ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రముఖ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్, నటుడు రామ్ పోతినేని, నటి కృతిశెట్టి హాజరయ్యారు.



## ఎంపీటీసీల సమస్యలు పరిష్కరించండి



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడిల కుమార్ గౌడ్

ఖైరతాబాద్, డిసెంబర్ 17: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గడిల కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సీతక్క స్పందిస్తూ తప్పకుండా సంఘం సభ్యులతో చర్చిస్తానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ రాష్ట్ర ఎంపీటీసీల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, ఉపాధ్యక్షుడు మాణిక్య రెడ్డి, కార్యవర్గ సభ్యుడు యాదయ్య తదితరులు ఉన్నారు.







దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఆదివారం కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరేడ్‌లో యువ పైలట్లు సైనిక విన్యాసాలు చేశారు.

## అనుభవాలను పుస్తక రూపంలో తేవాలి



ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయడంలో ప్రస్తుత పౌరసంబంధాల అధికారులకు మార్గదర్శకత్వం సూచించే విధంగా తమ అనుభవాలను పుస్తక రూపంలో తేవాలని సమాచార పౌర సంబంధాల శాఖ విశ్రాంత అధికారులకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీపీ ఆచార్య సూచించారు. పెన్షనర్స్ డే సందర్భంగా సమాచార, పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం టూరిజం ప్లాజాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాచార శాఖ విశ్రాంత మాజీ కమిషనర్ బీపీ ఆచార్య, విశ్రాంత మాజీ డైరెక్టర్లు కిస్మత్ కుమార్, ప్రమోద రావు, సత్యారావు, సుభాష్‌గౌడ్, మాజీ ప్రధాన సమాచార ఇంజినీర్ రమేశ్‌కుమార్‌లు హాజరయ్యారు.

–హైదరాబాద్, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ)